

# ఎన్నారై ముచ్చట్లు



–సత్యం మందపాటి

## (గతసంచిక తరువాయి)

## 3. 'అమెరికాలో మన పిల్లల తెలుగు భాష'

**'మనిషికొక పిచ్చి' అంటుంటారు మనవాళ్ళు**. మరి నేనూ ఒక మనిషినే కనుక నాకూ ఒక పిచ్చి వుంది. మామూలు పిచ్చి కాదు, విపరీతమైన పిచ్చి.

అదేమిటంటే మన మాతృభాష తెలుగు మీద పిచ్చి. ఎంత పిచ్చి అంటే తెలుగు వాళ్ళతో మాట్లాడేటప్పుడు తెలుగులోనే మాట్లాడుతాను. కొన్ని పదాలు తెలుగులో లేనివి, తప్పదు కనుక వేరే భాషల్లో... ముఖ్యంగా ఆంగ్లంలో మాట్లాడవలసి వస్తుంది. కానీ తెలుగు సాహిత్య సదస్సుల్లో, మన టీవీ రేడియోల ముఖాముఖీ కార్యక్రమాల్లోనూ ఒక్క ఆంగ్ల పదం కూడా రాకుండా తెలుగులోనే జవాబిస్తాను. అంతేకాక తెలుగు మాట్లాడటం, చదవటం, వ్రాయటం మాకు తెలీదు అనే తెలుగువారిని కలిస్తే కొంచెం బాధగా కూడా వుంటుంది.

నా మనసులో మాట చెప్పేశాను కనుక, కొంచెం గత ముప్ఫై సంవత్సరాల్లో భాషాపరంగా తెలుగు భాషకి ఏం జరిగిందో చెప్పి, విషయపరంగా ఈ వ్యాస రచనలోకి వెడతాను.

పాతిక సంవత్సరాల క్రితం భారతదేశంలో తెలుగు మాట్లాడేవారు, హిందీలో మాట్లాడేవారి తర్వాత రెండవ స్థానంలో వుండేవారు. ఇప్పుడది హిందీ, బెంగాలీ, మరాఠీల తర్వాత, నాలుగవదిగా క్రిందకు వెళ్ళింది. ఆంగ్లం కూడా కలుపుకుంటే తెలుగు ఐదవ భాష అవవచ్చు అంటున్నాయి కొన్ని అంతర్జాల సమూహాలు.

మరి ఎందుకు అలా జరిగింది? ఇంకా ఎందుకు జరుగుతున్నది?

నాకు దీనికి నాలుగు ముఖ్య కారణాలు కనిపిస్తున్నాయి.

*1. గ్రంథాలయ వ్యవస్థ కూలిపోవటం:*

అలనాటి తెలుగు ప్రభుత్వం నిధులన్నీ ఆపేసి గ్రంథాలయాలని గోదావరిలో కలిపేశాక, తెలుగు పుస్తకం చచ్చిపోయింది. 'ఇంతకు ముందు ఏ పుస్తకమయినా పదివేల కాపీలు వేసేవాళ్ళం. వాటిలో ఏడెనిమిది వేల కాపీలు లైబ్రరీలకు ఇచ్చేవాళ్ళం. ఇప్పుడు ఐదారు వందల కాపీలు వేస్తే లైబ్రరీలు పాతికో, పరకో మాత్రమే

తీసుకుంటున్నాయి. అది కూడా ఎన్నో ప్రయాసలు పడితేనూ, దొడ్డిదారుల ద్వారా వెడితేనూ!' అని ఇరవై ఏళ్ళకి ముందే నాతో అన్నారు మిత్రులు నవోదయా రామ్మోహనరావుగారు. ఇప్పుడు ఏ తెలుగు పుస్తకమయినా రెండు వందల కాపీలే ప్రచురించినా అవన్నీ అమ్ముడుపోవటం లేదు. అదీకాక రచయితలే స్వంత డబ్బుతో తమ పుస్తకాలు ప్రచురించుకునే దురవస్థలో ఉన్నది మన తెలుగు పుస్తకం. ఎన్నాళ్ళనించో నిలబడిన విపుల, చతుర, తెలుగువెలుగు, ఆంధ్రభూమి మొదలైన ఎన్నో పత్రికలు ఇప్పుడు మూతపడ్డాయి. తెలుగునాట తెలుగు భాషకు అంత్యక్రియల ప్రయత్నాలు ఆగకుండా జరుగుతూనే ఉన్నాయి. ఇది వ్రాయటానికి ఎంతో బాధగా ఉన్నా మరి నిజమెప్పుడూ నిష్ఠూరంగానే ఉంటుంది కదా! ఆమధ్య ఇండియాలో నేనొక గ్రంథాలయానికి వెళ్ళినప్పుడు, అక్కడ ఒకరో ఇద్దరో వయసులో పెద్దవారు వార్తాపత్రికలు చూస్తున్నారు తప్పితే ఎక్కువ పుస్తకాలు చదివేవారే కనపడలేదు. నేను స్కూలుకి వెళ్ళే రోజుల్లో, రోజూ సాయంత్రాలు గ్రంథాలయాలకి వెళ్ళి చదువుకునేటప్పుడున్న వైభవంలో ఇప్పుడు ఐదో వంతు కూడా లేదు. అమెరికాలో గ్రంథాలయాలు ఇప్పుడూ, ఎప్పుడూ పిల్లల దగ్గర నుండి పెద్దవారి వరకూ పుస్తకాలు చదువుకుంటూ ఎంతో కళకళలాడుతుంటాయి.

*2. ప్రసార మాధ్యమాలు:*

గత ఇరవై ఏళ్ళుగా దిన వార పత్రికల్లో భాష తెంగ్లీషులో వుండి, తెలుగు స్థాయి బాగా పడిపోయింది. ఇక సినిమాల్లో తెలుగు గురించి చెప్పనక్కరలేదు. అక్షరాలు సరిగ్గా పలికేవారు చాల తక్కువ. అడపాదడపా ఎప్పుడో వచ్చే కొద్ది కుటుంబ చిత్రాల్లో తప్ప చాలవరకూ పిల్లలతో చూసే సినిమా భాష కాదది. సెక్సూ, హింసాకాండలకు అంతులేక, ఆ భాష కూడా అదే స్థాయికి దిగజారింది. సినిమా పాటల్లో కూడా భాష భరించటం చాల కష్టమైపోయింది. తెలుగులో ఎంతోమంది మంచి గాయకులున్నా, తెలుగు భాషాజ్ఞానం ఏమాత్రం లేని పరభాషా గాయకులతో పాడించుకోవటం వల్ల, వారి ఉచ్చారణ వింటే తెలుగు భాష ఎంత ప్రమాద పరిస్థితిలో వుందో స్పష్టంగా తెలుస్తున్నది. అదే చెత్త భాష ప్రజల్లోకి వచ్చేసింది. ఇక టీవీ కార్యక్రమాలలో తెలుగు పూర్తి అధోగతిలో వున్నది. కార్యక్రమ సంధాతలు ('యాంకర్లు' అంటారు కొంకర్లు తిరుగుతూ) ఇటు తెలుగులో ఆంగ్లం కలుపుతారో, లేక ఆంగ్లంలో తెలుగు కలుపుతారో తెలీదు కానీ, ఆ రెండు భాషల్లో ప్రావీణ్యం ఉన్నవారికి మాత్రం అది అర్థం చేసుకోవటం కష్టమే. బాధాకరమే. అదే భాష ప్రజల్లోకి రావటం తెలుగు భాషకే చాల ప్రమాదకరం.

*3. అమ్ముడుపోయిన చదువులు:*

మా చిన్నప్పటి స్కూలు రోజులనించీ, పెద్దయాక డిగ్రీ కాలేజ్, ఇంజనీరింగ్ కాలేజ్, యూనివర్సిటీలలో మనసు పెట్టి పాఠాలు చెప్పే ఎంతో గొప్ప ఉపాధ్యాయులుండేవారు. ఏమైనా క్లాసులో అర్థం కాకపోతే, క్లాసు అయిన తర్వాత అక్కడే కొంచెంసేపో, వారి ఇంటికి రమ్మని ఉచితంగానో అవి ఇంకా వివరంగా చెప్పేవారు.

తెలుగునాట (రెండు తెలుగు రాష్ట్రాలూ) కేవలం ధనార్జన కోసమే కొన్ని వందల కాలేజీలు ప్రారంభించి, చదువుని అమ్మకానికి పెట్టారు. కొంతమంది విద్యార్థులు పాఠశాలల్లో చదువుకోవటం కాక 'చదువుకొనటం' మొదలుపెట్టాక, ఏవో కొన్ని కాలేజీల్లో తప్ప ఎక్కువ కాలేజీల్లో చదువు చెప్పటం మానేశారనీ, క్లాసుల్లో పాఠాలు చెప్పకుండా క్లాసులయాక అదే టీచర్లు ట్యూషన్లతో ఇంకా ఎంతో డబ్బు సంపాదిస్తున్నారని చెబితే ఆశ్చర్యపోయాను. విద్యార్థుల్లో బట్టీ విక్రమార్కులేకాక, అక్రమార్కులు కూడా ఎక్కువయారుట. అదీకాక ఏమాత్రం అర్థంపర్థంలేని కారణాలు చూపించి ఇంగ్లీష్ మీడియం పెట్టి, తెలుగు భాషకి తెగులు పట్టించిన బడులు కూడా ఎక్కువైపోయాయి. ఏది ఏమైనా తెలుగు చెప్పటం చాల తగ్గిపోయింది. మన భాషని మనమే వదిలేస్తున్నాం. ఈ విపరీత పరిస్థితి మన తెలుగు రాష్ట్రాల్లోనే తప్ప ఇతర రాష్ట్రాల్లో లేనే లేదు. తమిళ్, గుజరాతి, మహారాష్ట్ర, బెంగాలీ మొదలైనవి సజీవంగా వున్నాయి.

*4. అమెరికాకు, ఇతర దేశాలకు వలసః*

రెండు వేల సంవత్సరం నుండి అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా మొదలైన దేశాలకు ఉద్యోగరీత్యా నెల నెలా వేలమంది తెలుగువారు వలసపోవటం ఎక్కువయింది. అది ఆసరా చేసుకుని మన చదువులమ్మే కాలేజీలు, 'మీరు విదేశాలకు వెళ్ళేటప్పుడు తెలుగు నేర్చుకోవటం అనవసరమని' చెప్పటమేకాక, ఇంగ్లీష్ మాధ్యమ కాలేజీల్లో తెలుగులో మాట్లాడితే అదొక పెద్ద తప్పుగా చూపి, విద్యార్థులని శిక్షించటం కూడా మొదలైంది. ఆ వాదనకూ, శిక్షకూ వంత పాడుతున్న తల్లిదండ్రులు కూడా మన తెలుగు భాషను చిన్న చూపు చూడటంలో ముఖ్యమైన భాగస్వాములే.

మరి ఇలాటివి జరుగుతున్నప్పుడు 'దేశ భాషలందు లెస్స' అయిన తెలుగు భవిష్యత్తు ఏమిటి?

ఈమధ్య కొన్నేళ్ళుగా తెలుగు భాషని మృతభాషగా యునైటెడ్ నేషన్స్ ప్రకటించిందనే మాట ఎక్కడ పడితే అక్కడ వినిపిస్తున్నది. ఏ భాషనయినా 30 శాతం జనాభా కానీ, అంతకన్నా తక్కువ కానీ మాట్లాడటం, చదవటం, వ్రాయటం చేస్తుంటే ఆ భాష మృతభాష అయే అవకాశముంది అంటున్నారు యుఎన్ వారు. ఈ విషయం మీద ఎంతో సమాచార సేకరణ చేసి ఎన్నో సభల్లో ఆవేదనతో మాట్లాడి, పత్రికల్లో వ్యాసాలు వ్రాసి మీ అందరితో పంచుకున్నాను కనక, వాటి జోలికి ఈ వ్యాసంలో వెళ్ళటం లేదు.

తెలుగు భాషలో ఉపాధ్యాయ వృత్తిలో నిలదొక్కుకోవాలని అనుకున్నవాడిని ఇంజనీరునయాను. అయినా మన పిల్లలకు సాధ్యమైనంత వరకూ నాకు తెలిసినంత వరకూ భాషాపరంగా సహాయం చేస్తూనే వున్నాను.

అదేమిటో ఇప్పుడు పైకి చెప్పుకుంటున్న కొంత గత స్వగతం.

1970వ దశకంలో నేను కేరళలోని తిరువనంతపురం విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్లో పదేళ్లు ఉద్యోగం చేశాను. అప్పుడే దాదాపు ఒకే వయసులో వున్న తెలుగువాళ్ళం అక్కడ ఉద్యోగంలో చేరి, మా కొత్త జీవితాలు

మొదలుపెట్టాం. మా పిల్లలని ఇంగ్లీషు మీడియం స్కూళ్ళల్లో చేర్పించి, రెండవ భాషగా హిందీ తీసుకున్నాక, మరి తెలుగు ఎలా నేర్పించాలి అనే ఒక ప్రశ్న మొదలైంది. అందుకని మేమే ఒక తెలుగు బడి మొదలుపెట్టి పాఠాలు చెప్పటం మొదలుపెట్టాం. నాలుగైదేళ్ళు తెలుగు బడి నడిపి, నేను కూడా పిల్లలతోపాటు కొన్ని జీవిత పాఠాలు నేర్చుకున్నాక, పంథొమ్మిదివందల ఎనభైయ్యవ దశకం మొదట్లో మేము అమెరికాకి వచ్చేశాం.

హ్యూస్టన్లో అడుగుపెట్టాక, కొంతమంది తెలుగు మిత్రులు అప్పటికే నడుపుతున్న తెలుగు బడిలో నన్నూ అక్కడ పాఠాలు చెప్పమన్నారు. అక్కడ మూడేళ్లు పిల్లలకి పాఠాలు చెప్పాను. అక్కడ ఆ ప్రస్థానం ముగిసి, 1984లో టెక్సస్ రాజధాని ఆస్టిన్ నగరానికి వచ్చాం. ఆస్టిన్లో కొన్నేళ్ళు ఉద్యోగ సద్యోగాల్లో స్థిరపడ్డాక, మళ్ళీ తెలుగు బడి నేను మొదలుపెట్టాను. నాకు పాఠాలు చెప్పటం అంటే ఎంతో ఇష్టం కనుక, దాదాపు ఐదు సంవత్సరాలు ఇవన్నీ ఉచితంగా, మన పిల్లలకి ఎంతో ఉత్సాహంతో ఇష్టపడి చేశాను. కష్టపడి కాదు.

తిరువనంతపురం తెలుగు బడికీ, ఆ రోజుల్లో ఆస్టిన్ తెలుగు బడికీ చాల తేడాలున్నాయి. కేరళలోని తెలుగు పిల్లలు మన ఇళ్ళల్లో తెలుగు మాట్లాడేవారు. అందుకని తెలుగుని తెలుగులోనే నేర్పేవాళ్ళం. వాళ్లకి మేము చెప్పింది ఎక్కువగా తెలుగులో వాక్య నిర్మాణం చేయటం, పదజాలం, అక్షరాలని గుర్తించటం, వ్రాయటం, కొన్ని తెలుగు కథలు చెప్పటం మొదలైనవి.

ఆస్టిన్లో పిల్లలకి తెలుగుని ఇంగ్లీషులో నేర్పవలసి వచ్చింది. ఎందుకంటే ఆరోజుల్లో ఎక్కువమంది తెలుగు పిల్లలు ఇక్కడే అమెరికాలో పుట్టినవాళ్ళు. కొందరు ఇండియాలో పుట్టినా, ఇక్కడే పెరిగిన వాళ్ళు. వాళ్ళు అమెరికన్ స్నేహితులతో ఎక్కువగా కలిసిపోయేవారు. అదీకాక ఆనాడు అమెరికాలో ఏవో కొన్ని పెద్ద నగరాల్లో తప్ప, ఆస్టిన్ నగరంలాటి చిన్నవూళ్ళల్లో తెలుగువారు తక్కువమంది వుండేవారు. భారతీయులే తక్కువమంది వుండేవారు మరి! ఇంగ్లీషులో తెలుగు నేర్పటం కొంచెం కష్టమయింది. అందుకని నేనే ఒక సిలబస్ తయారు చేసుకుని, ఐదారేళ్ళు మన

పిల్లలకి తెలుగు నేర్పించాను. పిల్లలకే కాక, కొంతమంది తెలుగేతర తల్లిదండ్రులు కూడా క్లాసులో కూర్చునేవారు.

ఇక్కడ అమెరికాలో మనకి ఎన్నో తెలుగు సంఘాలు వున్నా వారి రాజకీయాలతోనూ, రెండేళ్ళకొకసారి చేసే తిరునాళ్ళతోనూ వారికి తెలుగు భాషాభివృద్ధికి సమయం దొరకటంలేదు. భారతదేశంలోని రాజకీయ నాయకులకీ, సినిమా నటులకీ సేవ చేయటంలోనే వారికి ఉత్సాహం ఎక్కువయింది.

తానా సంస్థ మాత్రమే 'పాఠశాల' అనే తెలుగు బడి నిర్వహిస్తున్నది. మా ఆస్టిన్ నించీ 'అంతర్జాతీయ తెలుగు బడి' కూడా కొన్ని వూళ్ళల్లో పిల్లలకి తెలుగు నేర్పిస్తున్నది. ఇంకా చాల నగరాలలో ఔత్సాహికులు కొందరు తెలుగు బడులు నిర్వహిస్తున్నారు. ఈ భాషాప్రియులందరికీ ధన్యవాదాలు.

కానీ అన్నిటిలోకీ 'మనబడి' నిర్వహిస్తూ, ఎంతో ముందుకి వెళ్ళి కొన్ని వేలమంది పిల్లలకు అమెరికాలోనే కాక ఇతర దేశాల్లో కూడా తెలుగు బడులు నిర్వహిస్తున్నది 'సిలికానాంధ్రా'. ఆ పిల్లలతో నేను ముఖాముఖీ చూసిన, తెలుగులోనే

ఆ విద్యార్థులతో మాట్లాడిన ఎన్నో సందర్భాలున్నాయి. తెలుగు భాషను సజీవంగా నిలబెడుతున్న వారి నిస్వార్థ భాషా సేవ గురించి కనీసం కొంతైనా మీకు చెప్పాలనిపించింది.

కొన్నేళ్ళ క్రితం మా ఆస్టిన్లోనూ, డాలస్ నగరంలోనూ నన్ను సిలికానాంధ్రా వారి 'మనబడి' వార్షికోత్సవాలలో, స్నాతకోత్సవానికి ముఖ్య అతిధిగా వచ్చి పట్టప్రదానం చేయమని ఆహ్వానించారు. ఆ పిలుపులతో పాత జ్ఞాపకాలు కళ్ళముందు కదలాడుతుంటే, మళ్ళీ ఆ పాత ఉత్సాహం వచ్చేసి వెంటనే సరే అనేశాను.

ఆస్టిన్, డాలస్ ప్రాంత నగరాల స్నాతకోత్సవాలు ఘనంగా జరిగాయి. ఇద్దరు ముగ్గురు ప్రముఖులతో పాటూ నన్నూ ముఖ్య అతిధిగా ఆహ్వానించారు.

కార్యక్రమం జరగబోయే ముందు, 'మనబడి' నిర్వాహకులు బడి గురించి కొంత సమాచారం చెప్పారు. 'మన బడి'లో మొత్తం ఆరు స్థాయిలు వున్నాయి. ఆరేళ్ళ వయసు వచ్చిన పిల్లలు మనబడిలో చేరవచ్చు. ముందుగా ప్రవేశం, తరువాత ప్రసూనం, ప్రకాశం, ప్రమోదం, ప్రభాసం అనే మెట్లు ఎక్కి తెలుగు భాషని చక్కగా నేర్చుకుని ఉత్తీర్ణులవుతారు. తెలుగులో వ్రాయటం, చదవటం, మాట్లాడటమే కాక, వ్యాకరణం, భాషాపరిజ్ఞానం, పదజాలం, పద్యాలు, సాహిత్యం మొదలైనవి అంతర్జాలంలో నేర్చుకుంటారు. ఇంకా చిన్న పిల్లలకు 'బాలబడి' కూడా వుంది.

నాకు నచ్చిన విషయం ఏమిటంటే, మన తెలుగు దేశంలోనే ఎందరో యువకులూ, యువతులూ తెలుగు మాట్లాడటం పెద్ద తప్పుగానూ, ఇంగ్లీషు మీడియంలో చదివితేనే జన్మ సార్ధకమైనట్టుగానూ భావించి మాతృభాషని విస్మరిస్తున్న సమయంలో, ఇలాటి మనబడులు అమెరికాలోనే కాక, ఎన్నో విదేశాలలో మన తర్వాత తరాల వారికి తెలుగు నేర్పటం, తెలుగుభాషని ఐక్యరాజ్య సమితి వారు అన్నట్టు మృతభాష కాకుండా అడ్డుకోవటం ముదావహం. అమెరికాలో 35 రాష్ట్రాలలోనూ, ఇంగ్లాండ్, సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా, దుబాయ్ లాటి 12 ఇతర దేశాల్లోనూ, 4500మంది పైన విద్యార్థులతో కళకళలాడుతున్నాయి సిలికానాంధ్రా వారి మనబడులు. ఇలాటి కార్యక్రమాలు ఇంత భారీ ఎత్తున, ఎన్నో దేశాలలో ఒకే పద్ధతిలో నిర్వహించటం మాటలు కాదు. నిర్వహణ మీద పట్టు కావాలి, పట్టుదల కావాలి. తెలుగు భాష మీద ప్రేమ కావాలి.

తెలుగు మాట్లాడటం, చదవటం, వ్రాయటం బాగా వచ్చిన తెలుగుబడి చిన్నారులు ఈమధ్యనే కథలు, కవితలు, చందోబద్ధమైన పద్యాలు, చిన్న నాటికలు వ్రాయటానికి ఉత్సాహం చూపితే, వాటికీ ప్రతి శనాదివారాలు తరగతులు మొదలుపెట్టారు. నేను సైతం 'కథలు వ్రాయటం ఎలా' అని అమెరికాలో పదకొండు మంది పిల్లలకి, తెలుగులో కథలు వ్రాయటం నేర్పుతున్నాను. వారి ఉత్సాహం, పట్టుదల చూస్తుంటే ముచ్చట వేయటమే కాక, త్వరలోనే కొంతమంది యువ కథా రచయితలు తయారవుతున్నారంటే ఉత్సాహంగా వున్నది. అంతేకాదు తెలుగు భాష భారతదేశంలో ఎలా వున్నా విదేశాల్లో సజీవంగా వుంటుంది అనే ధైర్యం కలుగుతున్నది. గర్వంగా వుంటున్నది.

మిత్రులు పుచ్చా మల్లిక్ స్థాపించిన “ఐబామ్” ద్వారా గాయకుడు నేమాని పార్థసారథి నిర్వహిస్తున్న భాగవత పద్యాల టీవీ కార్యక్రమంలో దేశదేశాల్లోని చిన్న పిల్లలు పోతనగారి పద్యాలు తీయగా పఠిస్తూ, వ్రాస్తూ, వాటికి భాష్యం చెబుతుంటే మనసు ఉప్పొంగిపోతుంది.

నెలనెలా జరిగే ఆస్టిన్ సాహిత్య సదస్సుల్లో కూడా మన పిల్లలు, తెలుగు సంస్కృత భాషల్లో ఎన్నో విషయాల మీద అనర్గళంగా మాట్లాడుతుంటే చాల ఆనందంగా వుంటుంది. ఇక్కడే పుట్టి పెరిగిన మన తెలుగు యువతలో ఒక అమ్మాయి చందోబద్ధంగా శతకం వ్రాయటం, ఇంకొక ఇద్దరు యువకులు అష్టావధానాలు చేయటం ఎంతో గర్వకారణం.

నేను తెలుగుబడి నడిపేటప్పుడు, ప్రతి నూతన విద్యార్థినీ ఒక ప్రశ్న అడిగేవాడిని. ‘మీరు ఇక్కడ అమెరికాలో పెరుగుతున్నారు, అమెరికన్ పిల్లలతో మెలుగుతున్నారు. ఎక్కడ చూసినా ఇంగ్లీషే. మరి మీరు తెలుగు ఎందుకు నేర్చుకుందామని అనుకుంటున్నారు?’ అని.

కొందరు మా బామ్మకి ఇంగ్లీషు రాదు, మా తాతయ్య నన్ను తెలుగులో ఉత్తరం వ్రాయమంటాడు, అమ్మమ్మ నాకు రెండు తెలుగు బొమ్మల పుస్తకాలు ఇచ్చింది అవి చదవాలి కదా, మా అమ్మా నాన్న తెలుగు నేర్చుకోమని బలవంతపెడుతున్నారు…’ ఇలా ఎన్నో జవాబులు చెప్పేవారు. అన్నిటిలోకీ నన్ను కదిలించినది ఒకే ఒక జవాబు. ‘నేను తెలుగు అబ్బాయిని/తెలుగు అమ్మాయిని. నా మాతృభాష నాకు రాకపోతే ఎలా?’ అనటం.

అప్పుడు నాకు అలెక్స్ హేలీ వ్రాసిన రూట్స్ నవల గుర్తుకి వచ్చేది. మూడు తరాల తర్వాత మన పిల్లల పిల్లల పిల్లలు ‘నాన్నా, నా మాతృభాష ఏమిటి? మన సంస్కృతి ఎలా వుంటుంది?’ అనే దుస్థితిలోకి పోతే ఎలా? మన మూలాలు మనమే మరచిపోతే ఎలా? అమెరికాలో మన పిల్లల తెలుగు భాషాభివృద్ధి చూస్తుంటే అలా జరగనే జరగదు అని గట్టి నమ్మకం కలుగుతున్నది.

తిరువనంతపురంలో మా మిత్రుడి కుమార్తె ఒకమ్మాయి ఇక్కడ ఫీనిక్సులో ఒక పెద్ద కంపెనీలో పని చేస్తూ, ఆఫీసు పని మీద మా ఊరికి వస్తే, మా ఇంటికి భోజనానికి పిలిచాం. కేరళలో పెరిగి, అమెరికాలో ఎన్నో ఏళ్లుగా వుంటున్న ఆ అమ్మాయి చక్కగా తెలుగు మాట్లాడటమే కాకుండా, మా ఇంట్లో అక్కడ బల్ల మీద వున్న తెలుగు పుస్తకం చదువుతుంటే ఆశ్చర్యం వేసింది. అదే అడిగాను ‘చిన్నప్పటినించీ ఆంధ్ర దేశంలో లేకుండానే, చక్కటి తెలుగు మాట్లాడుతున్నావు, చదువుతున్నావు. అదెలా’ అని. ఆ అమ్మాయి నవ్వుతూ అంది, ‘మరచిపోయారా అంకుల్. మీరు చెప్పిన తెలుగే కదా ఇది!’ అంది. ఆ మాటలకి నా మనసు తేలిపోతూ ఎటో వెళ్లిపోయింది. నేను నేర్పింది చాల తక్కువ. తెలుగు నేర్చుకోవటానికి అది అంకురార్పణ మాత్రమే. అయినా ఆ స్పందన వల్లే, ఆమె ఉత్సాహం వల్లే, తన పట్టుదల వల్లే అక్కడినించీ తన మాతృభాషాభిమానం, జ్ఞానం పెంచుకుంటూ పోయింది.

తమ సమయం ఎంతో వెచ్చించి స్వలాభం లేకుండా ఉచితంగా తెలుగు నేర్పుతున్న, ఉపాధ్యాయులందరికీ ఏనాడో ఒకనాడు, ఎక్కడో ఒక చోట, ఎవరో ఒక విద్యార్థి ఎదురుపడి వారికిలాటి ఒక సర్టిఫికేట్ ఇస్తారు.

ఎప్పుడో వేసిన విత్తనానికి, ఆ ఫలం అలా వచ్చినప్పుడు ఆ ఉపాధ్యాయుల జీవితంలో అదొక పెద్ద పర్వదినం కదూ!

*(మరో ముచ్చట వచ్చే నెలలో)*

COMMENTS